వైఎస్సార్‌సీపీతోనే ముస్లింల సంక్షేమం

- కుడా చైర్మన్ హర్షవర్ధన్, ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్
- కోడుమూరులో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన ముస్లింలు
- వైఎస్ జగన్‌కు మద్దతుగా భారీ బైక్ ర్యాలీ


కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్, సతీష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లింలు


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ అన్నారు. గురువారం కోడుమూరులో ముస్లిం మైనార్టీ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మైనార్టీల సంక్షేమానికి ఎంతగానో కృషి చేశారన్నారు. 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. తండ్రికి తగ్గ తనయుడిగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీలకు పెద్దపీట వేశారని.. సంక్షేమానికి అనేక పథకాలు, కార్యక్రమాలు చేపట్టారని.. చట్ట సభల్లోనూ వారికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. అయితే చంద్రబాబు అధికారం కోసం మతతత్వ పార్టీలతో పొత్తు పెట్టుకుని ముస్లింలకు తీరని ద్రోహం చేశారని దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో ముస్లింలంతా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఇలియాస్ బాషా మాట్లాడుతూ.. జగనన్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి గడపకు లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారం కోసం బీజేపీతో జతకట్టారని.. ముస్లింలంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

కోడుమూరులో టీడీపీకి చెందిన ముస్లిం మతపెద్దలు, చిన్న మసీదు కమిటీ పెద్దలు ఇక్బాల్, ఇంతియాజ్ బాషా, అస్లాం బాషా, ఎండీ ఫారుక్, నబీ, ముల్లా కబీర్, ఖాజా, మహబూబ్ బాషా, కటికె మహబూబ్‌బాషాతో పాటు వందమందికిపైగా ముస్లింలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ మాదులు, మాజీ ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సాజిత్‌ఆలీ, నాయకులు మగ్బుల్, మల్లారెడ్డి, శాశావలి, మాసుం, షేక్షా, గద్వాల్ రఫీక్, హరున్, జాకీర్, రసీద్, వీర, లింగమూర్తి, విష్ణుదాసు, లింగన్న, రాఘవేంద్ర, అబ్దుల్, హనుమంతు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ బైక్ ర్యాలీ

అంతకుముందు వైఎస్సార్‌సీపీ నేత ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ముస్లిం యువకులు కోడుమూరులో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి ర్యాలీని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీకి మద్దతుగా పట్టణ వీధుల్లో ర్యాలీ సాగింది.


సమావేశంలో మాట్లాడుతున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి


కోడుమూరులో ముస్లిం యువకుల బైక్ ర్యాలీ

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు


దుర్వేశి గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐ

గడివేముల: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని పాణ్యం సీఐ నల్లప్ప హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో సీఆర్పీఎఫ్ జవాన్లతో కలిసి కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం వంటివి చేస్తే చర్యలు తప్పవన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు, గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయనతో పాటు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు (అగ్రికల్చర్): మండల పరిధిలోని మామిదాలపాడు విద్యుత్ సబ్ స్టేషన్ సామర్థ్యం పెంపు పనులు నిర్వహిస్తున్నందున మామిదాలపాడు, మునగాలపాడు గ్రామాలకు శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

క్లుప్తంగా

సతీష్ నామినేషన్‌కు తరలిరండి


మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి

సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ నామినేషన్ కార్యక్రమానికి మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి కోరారు. గురువారం పార్టీ మండల నాయకులతో కలిసి మాట్లాడారు. కర్నూలు ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం సతీష్ నామినేషన్ దాఖలు చేయనున్నారని తెలిపారు. పార్టీ నాయకులు ఉదయం 10 గంటలల్లోపు కర్నూలు చిల్డ్రన్స్ పార్కుకు చేరుకోవాలని, అక్కడి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న, ఉప సర్పంచ్ ఎస్ఎం ఇబ్రహీం, సింగల్‌విండో మాజీ చైర్మన్ సీబీ గోవిందరెడ్డి, నాయకులు మహానంది, మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కొత్తకోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు


ఉపాధిహామీ పనులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: ఉపాధిహామీ పనులు చేసే ప్రదేశాల్లో కూలీలకు నీడ, నీటి సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. గురువారం మండలంలోని పోలకల్, సి.బెళగల్ గ్రామాల్లో ఉపాధి పనులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎండతీవ్రత అధికంగా ఉండడంతో పని చేసే ప్రాంతాల్లో రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నీడ, తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని, వృద్ధులు, అనారోగ్యం ఉన్న వారు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అందరికీ పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఘనంగా గ్రామోత్సవం


గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పాణ్యం: శ్రీరామనవమిని పురస్కరించుకుని పాణ్యంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. అంతకు ముందు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవమూర్తులను వాహనంపై కొలువుదీర్చి మంగళవాయిద్యాల మధ్య గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు, అధికారులు

పాణ్యం: ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సెక్టోరల్ అధికారి సుబ్రమణ్యం అన్నారు. గురువారం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల అధికారుల సూచనల మేరకు స్వీప్ కార్యక్రమంపై పాణ్యంలోని 278,279,280,281 పోలింగ్ బూత్‌ల పరిధిలో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. పాణ్యం బస్టాండ్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి ఓటర్లకు అవగాహన కల్పించారు.

బీజేపీ కూటమికి బుద్ధిచెప్పండి

పాణ్యం: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి కొందరు వ్యక్తులకు దోచిపెడుతున్న బీజేపీ, కూటమి పార్టీలకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పాణ్యంలో ఆ పార్టీ జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. రైతులు, కార్మికులకు అన్యాయం చేస్తున్న బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. పాణ్యం సీపీఎం అసెంబ్లీ అభ్యర్థి గౌస్ దేశాయ్‌ని గెలిపించాలని కోరారు. నాయకులు రమేష్, ప్రదీప్, నగరాజు, శ్రీధర్, మధు, శ్యామల, ప్రసాద్ పాల్గొన్నారు.

22న బీరప్ప స్వామి వార్షికోత్సవం

కర్నూలు కల్చరల్: కల్లూరు శ్రీ బీరప్ప స్వామి మూడో వార్షిక మహోత్స వం ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గోపూజ, గణపతి పూజ, కలశ స్థాపనం, గణపతి, రుద్ర, ప్రధాన దేవతా హోమాలు, బలిదానం పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శివనరసింహారెడ్డి

కల్లూరు: ఓర్వకల్లు మండల కేంద్రానికి చెందిన 50 టీడీపీ కుటుంబాలు గురువారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనేత కాటసాని శివనరసింహారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పెద్ద నగేష్, కురువ ఎల్లయ్య, శరత్, మధు, ట్రాక్టర్ హరి, పల్లె మద్దిలేటి, షెక్షావలి సహా 50 కుటుంబాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే పేదల జీవితాలు బాగుపడ్డాయన్నారు. అర్హతే ప్రమాణికంగా పథకాలు అందించడంతో రాష్ట్రంలోని ప్రతి గడపకూ మేలు జరిగిందన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంతిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. నాయకులు బి.చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వాసుదేవరెడ్డి, ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, పి.రమణారెడ్డి పాల్గొన్నారు.

22 నుంచి సుంకులా పరమేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలు


మేటీలకు తాంబూళాలు ఇస్తున్న ఈఓ

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం గ్రామదేవత సుంకులా పరమేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలను ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసయ్య తెలిపారు. ఉత్సవాల నిర్వహణపై స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద గురువారం మేటీలు, ఆయకట్టుదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా ఉత్సవాల్లో క్రీడలు నిర్వహించేందుకు పోలీసులు, దేవదాయశాఖ అధికారులు అనుమతించడం లేదన్నారు. 23వ తేదీ జరిగే రథోత్సవాన్ని అందరూ జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వారికి తాంబూళాలను అందజేశారు. ఆలయ చైర్మన్ ఉమామహేశ్వరమ్మ, లక్ష్మన్న, చెన్నయ్య, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవానికి ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం రథశాల నుంచి రథాన్ని భక్తులు బయటకు తీసుకొచ్చారు. ఆలయ చైర్మన్ ఉమామహేశ్వరమ్మ, కార్యనిర్వహణాధికారి నరసయ్య ఆధ్వర్యంలో భక్తులు రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీలోకి జోరుగా వలసలు


వైఎస్సార్‌సీపీలో చేరిన దిన్నెదేవరపాడు వాసులతో హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్

కర్నూలు (సిటీ): కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. గురువారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన 25 కుటుంబాలు ఎంపీటీసీ మద్దిలేటి ఆధ్వర్యంలో పార్టీలో చేరాయి. నియోజకవర్గ క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జయచంద్రుడు, శివకృష్ణ, బి.రాము, కె.భాస్కర్, గంగన్న, అశోక్‌కుమార్, బి.భాస్కర్, మధు, ఖాజా, చందు, భాస్కర్, నాగేంద్ర, మనోహర్, జయరాముడు, పరుశురాం, రాము, సురేష్, వెంకటేష్, సుధాకర్, రామకృష్ణ, మధుకుమార్, సుంకన్న ఉన్నారు. అలాగే బి.తాండ్రపాడు పరిధిలోని ప్రజానగర్, కర్నూలు అర్బన్‌లోని 38, 39, 40 వార్డులకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు పార్టీలో చేరారు. వీరిలో కళ్యాణ్‌రామ్ రెడ్డి, ఎండీ అస్లాం, సయ్యద్ ముజమ్మిల్‌తో పాటు 250 మంది టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.


బి.తాండ్రపాడు, 38, 39, 40వ వార్డులకు చెందిన టీడీపీ నేతలు

ఈ ప్రయాణం ప్రమాదకరం


జాతీయ రహదారిలో ఎదురెదురుగా వెళ్తున్న వాహనాలు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు–కడప జాతీయ రహదారిలో ట్రాఫిక్ ఉల్లంఘనలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సఫా ఫార్మసీ కళాశాల సమీపంలో నేషనల్ హైవే 340సీ పనులు జరుగుతుండడంతో కొందరు చుట్టూ తిరిగి రాలేక జాతీయ రహదారి 40లోనే ఎదురుగా వస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చుట్టూ తిరిగి వస్తే సమయం వృథా అవుతుందని కొందరు, డీజిల్, పెట్రోల్ ఆదా అవుతుందని మరి కొందరు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు నిబంధనలకు విరుద్ధంగా వన్‌వేలో ఎదురెదురుగా వాహనాలు నడుపుతున్నారు. ప్రమాదకరమైన ఈ ప్రయాణంపై జాతీయ రహదారుల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

- చంద్రబాబు హామీలను నమ్మొద్దు
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


కల్లూరు అర్బన్ 20వ వార్డులో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మరోసారి రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని.. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన హామీలను ప్రజలెవ్వరూ నమ్మరని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 20వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. 2014 ఎన్నికల్లో పొదుపు సంఘాలు, రైతు రుణాలను మాఫీ చేస్తామని చంద్రబాబు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి 2014లో మాదిరి మోసం చేయడానికి వస్తున్నారన్న విషయం రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. కూటమి పార్టీ ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని కూడా అమలు చేసిందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నో ఏళ్లుగా ఎన్నికలకు నోచుకోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు, ఇతర స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించామన్నారు. కర్నూలు నగరంలో పాలక వర్గం ఏర్పడిన తర్వాత నగరంలోని అన్ని వార్డుల్లో ప్రాధాన్యతలను అనుసరించి మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. నగరంతో పాటు కల్లూరు అర్బన్‌లోని 16 వార్డుల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లక్ష్మీరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, నాయకులు భీమాశంకర్‌రెడ్డి, సుకుమార్, మద్దయ్య, బత్తుల లక్ష్మయ్య, గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాసులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి


మృతదేహం

గూడూరు: గూడూరు సమీపంలో ఈ నెల 15వ తేదీ ఆటో బోల్తా పడి గాయపడిన షేక్ ఫిర్దోస్ (43) అనే మహిళ కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో గురువారం మృతిచెందినట్లు ఎస్ఐ హనుమంతప్ప తెలిపారు. మృతురాలు భర్తకు దూరంగా గూడూరులో ఉంటున్నట్లు చెప్పారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్పొరేటర్ ఇంటిపై దాడి

కల్లూరు: కల్లూరు అర్బన్ 41వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి ఇంటిపై గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి దాడి చేశాడు. ఇంటి గేటు వద్ద హల్‌చల్ చేసి ఇంటిముందున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశాడు. కార్పొరేటర్ కుటుంబ సభ్యులకు 4వ పట్టణ పోలీసులకు ఫోన్‌లో సమాచారం అందించారు. విచారణలో నిందితుడు శిల్పావందనంలోని వాటర్‌ప్లాంట్‌లో పనిచేసే వ్యక్తిగా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

గడివేముల: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 143 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ శివరామిరెడ్డికి అందజేశారు. గడివేములలో 16 మంది, గనిలో 9 మంది, కొర్రపోలూరు 6, మంచాలకట్ట 16, గడిగరేవుల 8, కొరటమద్ది 7, చిందుకూరు 12, బూజునూరు 9, పెసరవాయి 9, బిలకలగూడూరు 14, ఒండుట్ల 11, కరిమద్దెల 12, దుర్వేశి 14 మంది స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పించారు. రాజీనామాలను అమోదించినట్లు ఎంపీడీఓ తెలిపారు.


రాజీనామా పత్రాలు చూపుతున్న మద్దూరు వలంటీర్లు

పాణ్యం: మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. గురువారం మండలంలోని ఆలమూరు గ్రామంలో 11 మంది, మద్దూరులో 12 మంది రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పాణ్యం ఎంపీడీఓ భాగ్యలక్ష్మికి అందజేశారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

కల్లూరు: మండలంలోని తడకనపల్లె గ్రామానికి చెందిన 14 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు రాజీనామాలను సమర్పించారు. స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం పని చేస్తోందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ. 10వేలు ఇస్తాననే హామీపై నమ్మకం లేదన్నారు.


కల్లూరు: రాజీనామా చేసిన వలంటీర్లు

మీ కాలేయం జాగ్రత్త!

- పెరుగుతున్న కాలేయ బాధితులు
- ఒకవైపు ఫ్యాటీ లివర్, మరోవైపు హెపటైటిస్ వేధింపు
- మద్యం తాగడంతో లివర్ సిరోసిస్
- నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్): మానవ శరీరంలోని అతి పెద్ద గ్రంధి కాలేయం. ఇది జీవక్రియ, రోగనిరోధకశక్తి, జీర్ణక్రియ వంటి ప్రక్రియల్లో చురుకుగా వ్యవహరిస్తుంది. శరీరంలోని అన్ని అవయవాలు ముఖ్యమైనవే అయినా వాటిలో కాలేయం కొంచెం భిన్నం. ఎందుకంటే ఏ సమస్య వచ్చినా, శరీరం ముందే సంకేతాలు ఇస్తుంది. కాలేయం విషయంలో అలా కాదు. కాలేయం పూర్తిగా నాశనమయ్యే వరకు ఎలాంటి సంకేతాలను ఇవ్వదు. తాను పూర్తిగా నాశనమయ్యే వరకు మనిషి ఆరోగ్యం కోసం శ్రమిస్తూనే ఉంటుంది. కాబట్టి ఎలాంటి సమస్యలు లేవని కాలేయాన్ని అశ్రద్ధ చేయకుండా జీవనశైలి, ఆహారపు అలవాట్లు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారంలో ఆకుకూరలు, పీచుపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.

కాలేయ సమస్యలున్నవారే అధికం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జీర్ణకోశ వ్యాధుల విభాగం (గ్యాస్ట్రో ఎంట్రాలజి)లో 2022 సంవత్సరంలో 722 మంది, 2023లో 784 మంది, ఈ ఏడాది ఇప్పటి వరకు 347 మంది వివిధ కాలేయ వ్యాధులతో చేరి చికిత్స పొందారు. ప్రభుత్వ ఆసుపత్రితో పాటు నగరంలోని ప్రైవేటు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు, జనరల్ ఫిజీషియన్ల వద్దకు ప్రతిరోజూ 800లకు పైగా జీర్ణకోశవ్యాధులతో చికిత్స కోసం వెళ్తున్న రోగుల్లో 40 శాతం మంది కాలేయ సమస్యలున్న వారే ఉన్నారు. మొత్తంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యుల వద్దకు జీర్ణకోశసమస్యలతో 30 నుంచి 40 శాతం వరకు బాధపడుతూ చికిత్స కోసం వస్తుండగా అందులో 20 శాతం మంది ఆల్కహాలు సేవించడం వల్ల కాలేయం దెబ్బతినడంతో వచ్చిన వారున్నారు. మిగిలిన 10 శాతం ఆహారపు అలవాట్లు, వంశపారంపర్యం, హెపటైటిస్-బి, సి వైరస్ వంటి ఇన్‌ఫెక్షన్ల కారణంగా లివర్ దెబ్బతినడం వల్ల వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అన్ని రకాల జీర్ణకోశవ్యాధులు, కాలేయ వ్యాధులకు ఉచితంగా అత్యాధునిక వైద్యపరీక్షలు, మందులు అందజేస్తున్నారు. ముఖ్యంగా హెపటైటిస్-బి,సి వ్యాధులకు ఖరీదైన మందులను ఉచితంగా అందజేస్తున్నారు. ఇప్పటి వరకు 452 హెపటైటిస్ బి రోగులకు, 627 మంది హెపటైటిస్ సి రోగులకు మందులను ఉచితంగా అందజేశారు.

కాలేయ వ్యాధి రాకుండా ఉండాలంటే ఇలా చేయాలి...

- పచ్చని ఆకుకూరలు తినాలి. ఇవి లివర్‌ను శుభ్రంగా ఉంచుతాయి.
- సల్ఫర్ ఎక్కువగా ఉండే వెల్లుల్లి పాయలు లివర్‌ను కాపాడతాయి.
- పసుపు కాలేయానికి మేలు చేస్తుంది. గ్రీన్‌టీ, ఆపిల్ పండ్లు సైతం కాలేయానికి మంచివే.
- మంచి కొవ్వులు తినండి. ఆలివ్ ఆయిల్, వాల్‌నట్స్, అవకాడోలు కాలేయాన్ని శుభ్రం చేస్తాయి.
- విటమిన్-సి ఎక్కువగా తీసుకోవాలి. ఇది కాలేయం వద్ద కొవ్వులను నియంత్రిస్తాయి.
- రోజూ నీటిని ఎక్కువగా తాగాలి. దీనివల్ల కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

కాలేయ వ్యాధి లక్షణాలు

మీరు కాలేయ సంబంధిత వ్యాధిబారిన పడుతుంటే మీ శరీరం కొన్ని సంకేతాలు ఇస్తుంది. ఇందులో కాళ్లు, చీలమండలాల్లో వాపు, ఆకలి లేకపోవడం, వికారం, వాంతులు, జ్వరం, కామెర్లు, కడుపునొప్పి, మూత్రం రంగులో మార్పు, పొట్టచుట్టూ దురద, ఎరుపు చర్మం, మలంలో రక్తం మొదలైనవి. ఈ లక్షణాలు కనిపిస్తే విస్మరించకుండా వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి. రెండు అంతకంటే ఎక్కువ లక్షణాలు ఉంటే తక్షణ వైద్యసహాయం అవసరం. ఒక వ్యాధి అభివృద్ధి అయిన తర్వాత కష్టంగా మారే బదులు, కాలేయ ఆరోగ్యాన్ని ముందుగానే గ్రహిస్తే తద్వారా కాలేయ వ్యాధులువచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి.